


నేడు అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద అంగనవాడి 12 సెంటర్లకు సంబంధించిన టీచర్లు మినీ వర్కర్లు భారీ ధర్నాను శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మినీ అంగనవాడి సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ వెంటనే జీవో ఇవ్వాలని 42 రోజుల సమయం కోరుతూ తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీడీకి అంగన్వాడి యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు.



చేనేతకు బడ్జెట్‌లో... రిక్తహస్తమే..!

కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు రిక్తహస్తమే చూపింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, హెల్త్ స్కీముకు నిధులు, నూలు సబ్సిడీ, మార్కెట్ అవకాశాలు, వస్త్ర కొనుగోలుపై ఇచ్చే 20 శాతం రిబేట్ ఊసేలేదు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన సభలో చంద్రబాబు పాల్గొని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేనేత వర్గాన్ని విస్మరించాడని, తమ హయాంలో అన్నీ అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. చేనేతల ఆరోగ్య భద్రత తన బాధ్యతని చెబుతూ హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుకు రూ.10 కోట్లు ప్రకటించారని, కానీ గత సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా నిధుల కేటాయింపు లేకుండా పోయిందని చేనేతలు వాపోతున్నారు. చేనేతలకు పెనుభారంగా ఉన్న జిఎస్‌టి రద్దు చేయించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేంద్రం అంగీకరించని పక్షంలో చేనేతలు చెల్లిస్తున్న జిఎస్‌టి మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని భరోసా ఇచ్చారు. అయితే ఈ మేరకు వృత్తి భరోసాను నిలబెట్టుకునే ప్రయత్నం చేయలేదు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఊసేలేదు

హెల్త్ స్కీముకు కేటాయించని నిధులు

ప్రజాశక్తి - డక్కిలి

రొయ్యలు, చేపల చెరువులకు గత ప్రభుత్వం కంటే రూ.238 కోట్లు పెంపుదలతో మొత్తం రూ.738 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసిన ప్రభుత్వం, రాష్టంలో ఉన్న 2 లక్షలా 20 వేల మందికి పైగా ఉపాధి చూపిస్తున్న చేనేత రంగానికి తగిన విధంగా బడ్జెట్ లోకేటాయింపులు చేయలేదు. మొత్తం పరిశ్రమలు, వాణిజ్య శాఖ బడ్జెట్ రూ.4371.42 కోట్లు కాగా అందులో చేనేతలకు కేటాయించింది 4.42 శాతం అంటే రూ.193.19 కోట్లు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.2,94,427.25 కోట్లు అంచనా కాగా, చేనేతలకు కేవలం 0.066 శాతం మాత్రమే కేటాయింపులు చేయడంతో చేనేతల పట్ల ఈ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర బడ్జెట్లోనూ ఇదే రీతి...

కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.200 కోట్లనే కేటాయించింది. చేనేత రంగంలో ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పదికి పైగా పథకాలున్నప్పటికీ ఒక్క జాతీయ చేనేత అభివద్ధి కార్యక్రమం (ఎన్ హెచ్ డి పీ)కు మాత్రమే ఈ నిధులను నిర్దేశించింది. చేనేత, జౌళి, హస్తకళలతో కూడిన మొత్తం బడ్జెట్ రూ.4,392.85 కోట్లు కాగా.. అందులో 4.5 శాతం మేరకు చేనేతకు నిర్దేశించారు. చేనేత రంగానికి గత మూడేళ్లుగా కేటాయింపులు సుమారు రూ.200 కోట్లుగానే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికీ బడ్జెట్ కేటాయింపులు రూ.200 కోట్లు కాగా.. సవరణ బడ్జెట్లో దానిని రూ.190 కోట్లకు కేంద్రం తగ్గించింది. కేటాయించిన నిధులను సైతం ఎంతమేర ఖర్చు పెడుతుందో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఎంతో నైపుణ్యంతో మగ్గంపై చేనేత వస్త్రాన్ని తయారుచేసే కార్మికులకు కష్టానికి తగ్గ ఫలితం రావడం లేదు. ఇక చేనేత ఉప వత్తులపై ఆధారప డిన మహిళా కార్మికులకు పూట గడవడమే కష్టంగా మారింది. దీంతో చేసేది లేక ఇతర పనులకు వలస వెళుతున్నారు. చేనేత పేరు చెప్తే జిల్లాలో ముందుగా గుర్తు వచ్చే వెంకటగిరి తో పాటు తిరుపతి జిల్లాలోని పుత్తూరు, నారాయణవనం తదితర ప్రాంతాల్లో మగ్గాలు క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. వెంకటగిరిలో దశాబ్దం క్రితం ఐదు వేల మగ్గాల వరకు ఉండేవి. అయితే ప్రస్తుతం 2520 మగ్గాలే ఉన్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని నేత కార్మికులు చెబుతున్నారు. కులవృత్తిపై మమకారంతో నేటికీ మగ్గాలపై జీవనం సాగిస్తున్న నేత కార్మికులు ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా వీరు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్లా తయారు చేస్తున్నా మార్కెటింగ్ సదుపాయం లేక కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదు. రోజూ 18 గంటలు కష్టపడినా నెలకు రూ.10 వేలకు మించి రావడం లేదని నేత కార్మికులు అంటున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి : కోన మల్లికార్జున్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత

అధికారంలోకి వస్తే చేనేతను ఉద్ధరిస్తామని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని టిడిపి కూటమి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రజాగళం పాదయాత్రలో వెంకటగిరిలో చేనేత కార్మికుల కష్టాలు తీరుస్తామని, చేనేత టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కషి చేస్తానని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. 2014 -19 టిడిపి హయాంలో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి స్థల పరిశీలన చేసినా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం సరికాదు. బడ్జెట్లో చేనేతకు రూ.2000 కోట్లు కేటాయించాలి. 200 యూనిట్లకు ఉచిత కరెంటు జిఒ విడుదల చేయాలి.



సంపద సృష్టితో ఆర్థిక పరిపుష్టి

ఎపి బడ్జెట్‌పై సదస్సులో మునిరత్నంనాయుడు

ప్రజాశక్తి - క్యాంపస్

సంపదను సష్టించడం ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా పరిపుష్టి చేయవచ్చు అని విశ్రాంత ఆర్థికశాస్త్ర ఆచార్యులు మునిరత్నంనాయుడు పేర్కొన్నారు. ఎస్వియూలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ సెనెట్‌హాలులో 'ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2024 - 25' పై ఒకరోజు సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్సిటీ ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, కుల సచివులు ఆచార్య మాదాల భూపతినాయుడు, ముఖ్య వక్త విశ్రాంత ఆచార్యులు మునిరత్నం నాయుడు, వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఇన్చార్జ్ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుత బడ్జెట్ విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చేందుకు నిధులు కేటాయింపు జరిగిందన్నారు. ఇందు కొరకు ఆర్థిక మంత్రి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఉన్నత విద్యా శాఖకు రూ.2,326 కోట్లను కేటాయించారన్నారు. సాధారణ నిధులతో పాటు ఉన్నత విద్య ప్రక్షాళనకు నిధులు కేటాయించడం దీనికి నిదర్శనమన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ ఇప్పుడున్న సంప్రదాయ కోర్సులు వలన కొంత ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం వల్ల, నైపుణ్య అభివద్ధి శిక్షణ కోసం నైపుణ్యాభివద్ధి శాఖకు రూ.1,215 కోట్ల కేటాయింపునకు ప్రతిపాదన జరిగిందని తెలిపారు. ముఖ్య వక్త, విశ్రాంత ఆచార్యులు మునిరత్నం నాయుడు మాట్లాడుతూ రూ.43,402 కోట్ల వ్యవసాయ బడ్జెట్‌నూ, పాఠశాల విద్యకు రూ.29,909 కోట్లు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధికి రూ.16,739 కోట్లు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి రూ.18,421 వంతున పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో "ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన - ఎన్టీఆర్ 'నగరాలు' పథకం కింద, ఆర్థికంగా బలహీన వర్గాలకు 25 లక్షల ఇళ్లు/ఇళ్ల పట్టాలు ఇవ్వాలని లక్ష్యం కోసం రూ. 4,012 కోట్లు కేటాయించిందన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వెనకబడిన తరగతుల మైనారిటీ సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించిందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, అధ్యాపకులు ఆచార్య రాధిక, విభాగాధిపతి ఆచార్య సునీత, అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కుమార్ రాజా, డాక్టర్ గీత, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ పరదేశి పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా సిపిఎం మహాసభలు డిసెంబర్ 1, 2 తేదీలలో జరుగుతాయని, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం, సిఐటియు జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, కందారపు మురళి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలను డిసెంబరు 1,2 తేదీలలో సత్యవేడు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయని, దీనికి అన్ని కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 1వ తేదీన ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని, 2వ తేదీన నూతన నాయకత్వ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి టీటీడీ పరిపాలన భవనం ఎదుట 17 రోజులపాటు వేలాది మందితో పోరాడి విజయం సాధించిందని, 42 రోజులు పాటు పోరాడిన అంగన్వాడీ కార్యకర్తలకు అండగా నిలబడిందని, అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యాలు మెరుగుదల నుంచి కాంట్రాక్టు కార్మికుల కష్టాల పరిష్కారం వరకు అనేక అంశాల మీద నిరంతరం పోరాడుతూ, సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి భక్తులు, కార్మికులు, ఉద్యోగుల, ప్రజల పక్షాన పోరాడుతున్న పార్టీ సిపిఎం అని



తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట పట్టణం సిపిఎం కన్వీనర్‌గా సుంకర అల్లెయ్యను, సభ్యులుగా సి.చంద్రశేఖర్, కె.లక్ష్మయ్య, ఎస్‌కె రియాజ్, రామరాజు, కొండయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేటినుంచి మహతిలో నృత్య నాటక కళోత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శ్రీ పద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ 20వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం నుండి ఈనెల 19 వరకు మహతి కళాక్షేత్రంలో నృత్య నాటక కళోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కస్పా పద్మనాభం తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు శాస్త్రీయ నృత్యాలు, పౌరాణిక సాంఘిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం శ్రీనివాస కళ్యాణం, 17న శ్రీ రామానుజయ యుద్ధం, పౌరాణిక నాటికలు జరుగుతాయన్నారు. 18న జస్ట్ స్మైల్ వారిచే కృష్ణపక్షం సాంఘిక నాటక, 19న శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తిరుపతి నగర ప్రజలు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్, జయరాం ప్రసాద్ పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు పరిశీలన


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో జరుగుతుతున్న అభివద్ధి పనులను స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్, ఇండోర్ స్టేడియం, మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులను శుక్రవారం ఇంజినీరింగ్ , స్మార్ట్ సిటీ అధికారులతో కలసి పరిశీలించారు. మూడు ప్రాజెక్టుల పనుల పురోగతిపై అధికారులు కమిషనర్ కు వివరించారు. ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, డి.ఈ.లు రాజు, మధుబాబు, ఏ ఈ కాం ప్రతినిధి బాలాజి ఉన్నారు.

రేపు జీ తెలుగులో 'ఆయ్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఈ ఆదివారం మరో కొత్త సినిమాతో మీ ముందుకు రాబోతుందని జిల్లా జి నెట్వర్క్ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టాలీవుడ్ యంగ్ హీరో నార్నె నితిన్ ప్రధాన పాత్రలో నటించిన ఆయ్ సినిమాని ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ సినిమా బుల్లితెర ప్రేక్షకులను అలరించేందకు వచ్చేస్తోంది. ఆకట్టుకునే లవ్ ట్రాక్తో పాటు కడుపుబ్బా నవ్వించే కామెడీ పంచులతో ఆద్యంతం అలరించి సూపర్ హిట్గా నిలిచింది.



విద్యార్థులను పరీక్షిస్తున్న రుయా చిన్నపిల్లల వైద్య నిపుణులు

గురుకులంలో రుయా చిన్నపిల్లల వైద్యబృందం

ప్రజాశక్తి - సత్యవేడు

జ్యోతిరావుపూలె బిసి బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులకు వైరల్ జ్వరాలు ప్రబలిన విషయం విదితమే. శుక్రవారం కూడా కొత్త కేసులు నమోదు కావడంతో తిరుపతి నుంచి రుయా ఆస్పత్రికి చెందిన చిన్నపిల్లల వైద్యనిపుణులు సత్యవేడుకు విచ్చేసి వైద్యసేవలు అందించారు. పాఠశాలలో మొత్తం 418 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, దాదాపు 90 మంది విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. గురువారం తీవ్ర అస్వస్థతకు గురైన శివకుమార్‌ను రుయాకు తరలించారు. శుక్రవారం మరో విద్యార్థి కె.మహేష్‌ను రుయాకు పంపించారు. మంత్రి

90కి చేరిన జ్వరపీడితుల సంఖ్య

సవిత ఆదేశాల మేరకు జిల్లా వైద్య అధికారులు స్పందిస్తూ చిన్నపిల్లల వైద్యనిపుణులైన డాక్టర్ ప్రసాద్‌రెడ్డి బృందాన్ని సత్యవేడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపించి వైద్యసేవలు అందించారు. అనంతరం గురుకుల పాఠశాలకు చేరుకుని పాఠశాలలో నిర్వహిస్తున్న హెల్త్‌క్యాంపులో విద్యార్థులను పరిశీలించారు. స్వల్పంగా బాధపడుతున్న వారికి అక్కడికక్కడే వైద్యసేవలు అందించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం క్యాంపు నుంచి స్థానిక సిహెచ్‌సికి బదిలీ చేశారు.



టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల విరాళం

ప్రజాశక్తి - తిరుమల

బెంగళూరుకు చెందిన బీ.ఎం.కే.నగేష్ అనే భక్తుడు శుక్రవారం టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు దాత డీడీని టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి తిరుమలలోని వారి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఆయుధపూజ

తిరుమల : తిరుమలలోని మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ముందుగా వేద మంత్రోచ్చారణ మధ్య శ్రీ పద్మావతి, శ్రీ వేంకటేశ్వరుని చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం సిబ్బందిని అడిషనల్ ఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా స్వర్ణాంధ్ర విశ్వబ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహర్ ఆచారి ప్రకటించారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్ లో ప్రతినిధుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా గుంటి కోవెల తిరుమల ఆచారి, నగర అధ్యక్షులుగా శ్రీమంతుల రామయ్యచారి, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా రామచంద్రాచారిని సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

భూకబ్జాల నుంచి చెరువులను కాపాడాలని జేసీకి వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో చెరువులు, కుంటలు, వాగులు, కాల్వలను భూకబ్జాదారుల నుంచి కాపాడాలని సిపిఎం ఆధ్వర్యంలో జెసికి జిల్లా నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలో భూములు చాలా విలువైనవని, ఫలితంగా అధికార, ప్రతిపక్ష పార్టీలవారు ఎక్కడ చూసినా కబ్జా చేస్తున్నారన్నారు. చెరువులు, కుంటలు, కాల్వలు అనుకుని బఫర్ జోన్లు ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఎక్కడచూసినా ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారన్నారు. యోగిమల్లవరం వన్ బై వన్, వన్ బై టు సర్వే నంబర్‌లో చెరువును ఆక్రమించుకుని ఇల్లు



నిర్మిస్తున్నారన్నారు. ప్రత్యక్షంగా రెవెన్యూవారూ సహకరిస్తున్నారన్నారు. 120 ఎకరాలు ఉన్న పద్మావతిపురం చెరువు పూర్తిస్థాయిలో ఆక్రమణకు గురయ్యిందన్నారు. వెంకటాపురం చెరువును ఆక్రమించేశారన్నారు. తిరుపతి నడిబొడ్డున పాన్‌చెరువు ఆక్రమణకు గురయ్యిందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపిటిసి కె.సుమన్ ఉన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి : డిఆర్‌డిఎ పీడీ శోభన్‌బాబు

ప్రజాశక్తి - రామచంద్రాపురం

డ్వాక్రా సంఘాల అభివృద్ధి, ఆదాయ వనరులను పెంపొందించడానికి ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు టి ఎన్ శోభన్ బాబు అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు విరివిగా అందించేటట్లు చూడాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాల నుండి క్రమం తప్పకుండా రుణాలు చెల్లింపులు చేయించాలన్నారు. గ్రామ సమైక్యలు, డ్వాక్రా సంఘాల రుణాలను సభ్యుల ఖాతాలకు జమ చేసి అక్రమాలకు చోటు లేకుండా చేయాలన్నారు. మండల, గ్రామ సమాఖ్యల రుణాలు, చెల్లింపుల వివరాలను సమగ్రంగా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. డ్వాక్రా సంఘాలలోని మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం శ్రీనిధి ద్వారా నిధులు తీసుకుని రీ పేమెంట్స్ సక్రమంగా జరిగేటట్లు చూడాలన్నారు. మండల, గ్రామ సమాఖ్య ల ఆడిట్ నివేదికలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఏపిఎం గురుమూర్తి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సుధాకర్, అరుణ, పార్వతి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కార్పొరేటర్ అనిత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విజయవాడలోని సచివాలయంలో తిరుపతి నగర పాలక సంస్థ 48వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసి ఛైర్మన్, అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్ర యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి తెలుగుదేశం పార్టీ అభివద్ధి కోసం చేసిన కార్యక్రమాలను సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా అన్నా అనిత యాదవ్ చేసిన కార్యక్రమాల వివరాలను సిఎం చంద్రబాబు నాయుడు నిశితంగా విన్నారు. త్వరలోనే మంచి అవకాశం కల్పిస్తామని సిఎం హామీ ఇచ్చారన్నారని కార్పొరేటర్ అనిత యాదవ్ తెలిపారు. సిఎంను కలిసిన వారిలో బీసీ రాష్ట్ర నాయకులు లాకా వెంగళరావు, శంకర్ యాదవ్, కొర్లగుంట ముని, రఫీ హిందుస్థానీ తదితరులు ఉన్నారు.



కెనరా బ్యాంకు సేవలు విస్తరణ : సిఇఒ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



నూతన ఆలోచనలతో బ్యాంకింగ్ సేవలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో కెనరా బ్యాంక్ నూతన పద్ధతులను పాటించి మంచి ఫలితాలను సాధిస్తుందని బ్యాంక్ ఎండి, సీఈవో కె. సత్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని అవిలాల మార్గంలో కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయ నూతన సముదాయాన్ని సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన స్కీమ్స్ ద్వారా ప్రామాణికమైన వడ్డీ రేటుతో రుణాలు ఇస్తూ తద్వారా బ్యాంకింగ్ సేవలను, లాభాలను పొందే విధంగా ప్రణాళికా బద్దంగా ముందుకెళుతున్నామన్నారు. ఇప్పటివరకు తిరుపతిలో బ్యాంకులకు సంబంధించిన రీజనల్ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయని, సర్కిల్ ఆఫీసు ఏర్పాటు చేసింది ఒక కెనరా బ్యాంకు మాత్రమే అన్నారు. కెనరా బ్యాంకు డబుల్ డిజిట్ గ్రోత్ సాధించి సెప్టెంబర్ మాసంలోని 4వేల కోట్ల రూపాయల లాభాన్ని ఆర్జించిందన్నారు. నేడు బ్యాంకు లావాదేవీలు రూ.23.59 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. బ్రాంచ్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంత్య, బ్రాంచి జిఏడబ్ల్యూ జనరల్ మేనేజర్ రామనాయక్, కేంద్ర కార్యాలయం జనరల్ మేనేజర్ రవికష్ణ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్య ప్రకాష్ సింగ్ పాల్గొన్నారు.

మైనర్లను పనుల్లో పెట్టుకోవద్దు:ఏసీఎల్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'మైనర్లను పనుల్లో పెట్టుకోవద్దు' అని సహాయ కార్మిక కమిషనర్ చిన్న లాలెప్ప హెచ్చరించారు. పాన్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ చేపట్టిన బాల కార్మికుల నిర్మూలన ప్రోగ్రాంలో భాగంగా తిరుపతి సహాయ కార్మిక కమీషనర్ యస్. చిన్న లాలెప్ప ఆధ్వర్యంలో కార్మికశాఖ అధికారులు , ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అదికారులు కలిసి తిరుపతిలో వివిధ సంస్థలు దుకాణాలలో బాల కార్మికులు ఎవరైనా పని చేస్తున్నారా అని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులకు 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదని అవగాహన



కల్పించారు. ఈరోజు తనిఖీలో భాగంగా ఒక అబ్బాయి బాల కార్మికుడిగా పనిచేస్తున్నట్టు గుర్తించి, వారి వివరాలు అన్ని నమోదు చేసారు. కార్మిక శాఖ అధికారులు రాజయ్య ,రంగనాథ్ , ప్రవీణ్ కుమార్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజారెడ్డి, డిసిపీవో దేవయాని, కల్పన పాల్గొన్నారు.

జువాలజీ అధ్యాపకునికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకులు డాక్టర్ కె శివ ప్రసాద్ ప్రిన్సిపాల్గా శుక్రవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేదవ్యాసలో క్యాన్సర్పై వైద్య శిబిరం



వేదవ్యాస సంస్థ సిబ్బందికి క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక వేదవ్యాస విద్యా సంస్థలో తిరుపతి లోని టాటా క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో వేదవ్యాస సంస్థ సిబ్బందికి క్యాన్సర్పై ఉచిత వైద్య శిబిరాన్ని ఆ సంస్థ ఛైర్మన్లు వేద, బాల సరస్వతి, నారాయణబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, నోటి క్యాన్సరు, రొమ్ము క్యాన్సరు, వివిధ రకాల క్యాన్సర్లపై వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ బాబు, వేద మాట్లాడుతూ క్యాన్సర్పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని క్యాన్సర్ అంటు వ్యాధి కాదన్నారు. మత్తు పదార్థాలు, గుట్కా, తంబాకు తినడం వల్ల తప్పని సరిగా వస్తుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నేటి సమాజంలో చాలామంది విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసల వుతున్నారని వాటిని నిర్మూలనకు తప్పని సరిగా అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టాటా క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, వేదవ్యాస విద్యా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



గ్రంథాలయంలో పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా పుత్తూరు గ్రంథాలయం శాఖ అధికారిణి మీనాకుమారి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను కాపు వీధి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం మల్లిక రాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు పుస్తకాలు, సైన్సు, విజ్ఞాన సంబంధిత పుస్తకాలు, బాల సాహిత్యం, భారత భాగవతం, రామాయణం, దేశ నాయకుల జీవిత చరిత్ర, నవలు, సాహిత్య పుస్తకాలు ఈ ప్రదర్శనలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, విద్యార్థిని విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తొట్టంబేడు గ్రంథాలయ అధికారి ఎ హరికృష్ణ సూచించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు ఉపయోగించుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ సభ్యత్వం తీసుకుని ఉత్తమ నేస్తాలైన పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని హరికృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

జవాబుదారీ తనంతో వ్యవహరించండి: డిఎస్పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి వచ్చే భక్తుల పట్ల లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహ మూర్తి సూచించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో లాడ్జి ఓనర్లు, హోటల్ నిర్వాహకులు, మేనేజర్లు, రూమ్ బాయ్స్ మధ్య వర్తులకు శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఆలయానికి వస్తున్న భక్తుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని డిఎస్పి తెలిపారు. తప్పని సరిగా లాడ్జిల ముందు గదులు, వాటికి సంబంధించిన ధరల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సీఐ గోపి పాల్గొన్నారు.

శ్రీపద్మావతి అమ్మవారికి బంగారు మాల బహూకరణ

ప్రజాశక్తి- తిరుపతి: టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ డికె ఆదికేశవులు కుమార్తె తేజస్విని, మనవరాలు చైతన్య తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మ వారికి స్వర్ణ వైజయంతీ మాలను శుక్రవారం బహూకరించారు. ఈ మేరకు దాతలు డీకే తేజస్విని, చైతన్య నుంచి టిటిడి డిప్యూటీ ఈవో గోవింద రాజన్ స్వర్ణ వైజయంతీ మాలను శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయంలో స్వీకరించారు. అనంతరం దాతలు అమ్మవారిని దర్శించుకున్నారు.

సుస్థిర అభివృద్ధి వైపు సహకార సంఘాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సుస్థిర అభివృద్ధివైపు సహకార సంఘాలు ముందడుగు వేస్తున్నాయని తంగేళ్లపాలెం ప్రాథమిక సహకార సంఘం అధికారిక ఇన్ఛార్జి రవిబాబు, సీఈవో చిరంజీవి రెడ్డి తెలిపారు. తొట్టంబేడు మండలంలోని తంగేళ్ల పాలెం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో శుక్రవారం 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా సాంకేతిక అభివృద్ధి సాధించి తద్వారా సుపరిపాలన అందించడానికి దోహదపడుతుందన్నారు. సిబ్బంది శేఖర్, శ్రీనివాసులు, వాసు, రాజశేఖర్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు ఘన సన్మానం



క్రీడాకారిణికి షూలు అందిస్తున్న మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏలూరు జిల్లా చింతల పూడిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ అండర్ – 14 బాలికల సింగిల్స్, డబుల్స్ కంబైన్డ్ విభాగంలో నెల్లూరు జిల్లా 4వ స్థానం సాధించిన జట్టు క్రీడాకారిణులు బి శ్రీలేఖ (జెడ్పీ హైస్కూలు, సైదాపురం), బి సాయి మేఘన (జెడ్పీ హైస్కూల్, అత్తివరం), యస్ అంజు శ్రీ (మైకా మైనింగ్ హైస్కూలు, కలిచేడు) లను గూడురు మినీ గురుకులంలో నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్ శుక్రవారం సత్కరించి వారికి స్పోర్ట్స్ షూలు అందించారు. ఈ సందర్భంగా శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ టెన్నికాయిట్ క్రీడాభివృద్ధికి 2025 లో జిల్లాలోని 5 నుండి 8 తరగతుల బాలబాలికలకు గూడూరులో ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరి ప్రియత, అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పి భాస్కర్, ట్రెజరర్ కె మల్లికార్జున , మినీ గురుకులం పిఈటి నాగూరమ్మ, మినీ గురుకుల విద్యాలయ ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎక్కువ చెత్త వుంటే కంపోస్టుగా మార్చండి: కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో వంద కేజీల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్స్ (బల్క్ జనరేటర్స్) వారు తడిచెత్తను ఎవరి పరిధిలో వారే కంపోస్టుగా మార్చుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య అన్నారు. నగరంలో చెత్త ఎక్కువ ఉత్పత్తి చేసే వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలతో కమిషనర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతిలోని పెద్ద పెద్ద హోటల్స్, అపార్టుమెంట్స్, రెస్టారెంట్ల వారు వంద కేజీల కంటే ఎక్కువ చెత్తని ఉత్పత్తి చేస్తున్నారని అన్నారు. ఎవరైతే 100 కేజీల కంటే ఎక్కువ చెత్తని ఉత్పత్తి చేస్తున్న వారు అంతా తడి చెత్తను వాళ్ల పరిధిలోనే కంపోస్ట్గా మార్చుకుని, పొడి చెత్తను నగర పాలక సంస్థ సిబ్బందికి అందించాలనే ప్రభుత్వ నిబంధన వుందన్నారు. ఈ తడిచెత్తను మెకనైజ్డ్ సిస్టం, బయో గ్యాస్ సిస్టం ద్వారా, లేదా ఇంకా ఇతర పద్ధతుల ద్వారా అయినా తడిచెత్తని వాళ్ల పరిధిలో ఎరువు(కంపోస్టు)గా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఎరువును వారే చెట్లకి, గార్డెన్స్కి ఉపయోగించు కోవాలని, నగరంలో ఎక్కువ చెత్త ఉత్పత్తి చేస్తున్న వాణిజ్య సముదాయాలు, హోటల్స్, రెస్టారెంట్లు, అపార్టు మెంట్ల వారిపై సర్వే నిర్వహిస్తా మన్నారు. ఇందులో వంద కేజీల కంటే ఎక్కువ ఉత్పత్తి చేసే వారిని గుర్తించి నిబంధనలు వివరిస్తా మన్నారు. అందరూ చెత్తని మూడు రకాలుగా విభజించి ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. తాము చెప్పిన ప్రకారం చేస్తే కాలువల్లో చెత్త వేయడం, నగరంలో చెత్త కుప్పలు లేకుండా చేసేందుకు వీలు అవుతుందని, ప్రభుత్వ నిబంధనలు పాటించని వారికి అపరాధరుసుం విధిస్తామని హెచ్చరించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, గుడ్డ, పేపర్ కవర్లు, జ్యూట్ బ్యాగులు కస్టమర్లకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మస్తాన్, అజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : 2024 సంవత్సరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన హోం సైన్స్ విభాగం ఆచార్యులు కె సుచరిత, జువాలజీ విభాగం ఆచార్యులు ఎం రాజశేఖర్లను ఎస్వియూ ఇన్ఛార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రారు ఆచార్య ఎం భూపతి నాయుడులు ఉప కులపతి ఛాంబర్లో శుక్రవారం అభినందించారు. ఈ నెల 11వ తేదీ విజయవాడలో నిర్వహించిన వేడుకలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మానవవనరులశాఖ మంత్రి లోకేష్ వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఎస్వి యూనివర్సిటీలో బోధన,



ఆచార్య కె సుచరితను అభినందిస్తున్న ఎస్వియూ ఇన్ఛార్జి విసి అప్పారావు



ఆచార్య ఎం రాజశేఖర్ను అభినందిస్తున్న ఎస్వియూ ఇన్ఛార్జి విసి అప్పారావు

పరిశోధనలు, విశేష సేవలు చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డుకు వారిని ఎంపిక చేసినట్లు విసి పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంతో అధ్యాపకుల కృషిని, అంకిత భావాన్ని, అకడమిక్ ఎక్సలెన్స్ను గుర్తించినట్లయిందన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఖ్యాతిని మరింత పెంచేందుకు, విద్యా ప్రమాణాలు అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని, వర్సిటీలోని అధ్యాపకులందరికి సూచించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు విజేతలకు ఎస్వియూ అధికారులు అభినందనలు తెలిపారు.

ఏఓగా సెక్రెటరీ రాజుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పంచాయతీ సెక్రటరీగా చిన్నగొట్టిగల్లు పంచాయతీలో పనిచేస్తున్న మదనమోహన రాజుకు యర్రావారిపాళెం మండల పరిషత్తు కార్యాలయానికి ఏవోగా ఉద్యోగోన్నతి కల్పించడంతో శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించారు. సౌమ్యుడు, మితభాషి,, మార్గదర్శి, కార్యశీలిగా అయన తోటి ఉద్యోగుల వద్దే కాకుండా నాయకుల వద్ద మంచి పేరు తెచ్చు కొనడంతో సుదీర్ఘకాలం ఆయన మండలంలో పని చేశారు. మదన మోహన రాజు 1993లో గ్రామీణ అబివృద్ధి అధికారిగా విజయపురం మండ లం నుండి తన కెరీర్ ప్రారంభించారు. తరువాత 1994 పీలేరు ఎంపిడీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తర్వాత చిన్నగొట్టిగల్లు మండలంలో 2002 నుంచి 2012 వరకు పంచాయతీ సెక్రటరీగా పనిచేసి తరువాత ఈవోగా పాకాల మండలంలోనూ, పంచాయతీ సెక్రటరీగా మదనపల్లిలో పని చేశారు. 2017 నుంచి 2014 నవంబరు 14 వరకు సెక్రటరీగా చిన్నగొట్టిగల్లు మండలంలో పనిచేస్తూ ఏఓగా ప్రమోషన్పై వెళుతున్న సందర్భంగా ఆయనను శాలువలు, పూల మాలలతో సత్కరించి సుదీర్ఘకాలం మండలంలో పని చేసిన ఆయనను తోటి ఉద్యోగులు, నాయకులు సేవలను కొనియాడారు. తిరిగి ఆయన ఏఓగా మండలానికి రావాలని ప్రతి ఒక్కరూ కోరడం విశేషం. నాయకులు, సహచర ఉద్యోగుల సహాయ సహకారాలు అందించడం వల్లే సుదీర్ఘ కాలం పనిచేయగలిగానని మదనమోహనరాజు ఆన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ గిడ్డయ్య, ఈఓఆర్డి సోమసేఖరరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పిఆర్ఏఈ ప్రకాష్ రెడ్డి,సెక్రెటరీలు,ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.



మదనమోహన్రాజును సన్మానిస్తున్న సహపాటి ఉద్యోగులు

నిరాధార ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

రిజిస్ట్రారుకు విద్యార్థుల వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అసత్య ప్రచారాలకు కొందరు వ్యక్తులు పూనుకుంటున్నారని తక్షణమే విచారణ జరిపి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు రిజిస్ట్రార్ ఆచార్య ఎం భూపతి నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8,9,10వ తేదీ లలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో యూత్ ఫెస్టివల్ను అత్యంత వైభవంగా నిర్వహించారని కొన్ని అనివార్య కారణాల రీత్యా ఆచార్య మురళిధర్ ఆన్ డ్యూటీలో విజయవాడకు వెళ్లారని డిఎస్ డబ్ల్యూసిఎ డైరెక్టర్గా ఉన్న ఆచార్య మురళిధర్ చివరిరోజు కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారని ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఓర్వలేని కొందరు వ్యక్తులు ఆచార్య మురళిధర్ పై నిరాధారమైన ఆరోపణలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా తప్పులు జరిగి ఉంటే ఆధారాలు బయటపెట్టి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని అలా కాకుండా వేవరి ప్రయోజనాల కోసం వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారని తెలిపారు. తక్షణమే ఇలాంటి వాటిపై కేసు నమోదు చేయించి విచారణ జరిపించాలని కోరారు. గత 35 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన అంశాలతో పాటు కల్చరల్, స్పోర్ట్స్ అంశాలలో ముందుండే ఆచార్య మురళీధర్కి విద్యార్థుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని అందుకే విద్యార్థులగా మేము విచారణ జరిపించాలని కోరుతున్నామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వివిధ విభాగాల విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులకు మెరుగైన చికిత్స: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని బిసి గురుకుల పాఠశాలలో విద్యార్థులు రెండు రోజులుగా తీవ్రమైన జ్వరం కారణంగా స్థానిక సామాజిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యార్థులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్యూసులు పంపిణీ చేశారు. అధైర్య పడవద్దని మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు చేపడతామని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సత్యవేడు టిడిపి ఇన్ఛార్జి డాక్టర్ శ్రీపతి బాబు ఫోన్ ద్వారా స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి సురేష్తో మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని ఆలస్యం చేస్తే ప్రమాదమని సూచించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను సత్యవేడు సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ పరామర్శించారు. జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో అపరిశుభ్ర పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి పారిశుధ్య లోపం, పాఠశాల యాజమాన్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు విష జ్వరాలు సోకడానికి కారణమన్నారు. సొసైటీ పాఠశాలలో యాజమాన్య లోపం వల్ల బాల్యం చితికి పోతుందని మెరుగైన మౌలిక వసతులు, పోషకాహారం లేక, నాణ్యమైన విద్య దొరక్క విద్యార్థులు ఇక్కట్లు పడుతు న్నారని వ్యాఖ్యా నించారు. ప్రభుత్వం సత్వరమే సొసైటీ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మురళి స్పందిస్తూ విద్యార్థుల పరిస్థితి చూసి గుండెలు తరుక్కుపోతుందని తమ బిడ్డలను విద్యావంతులను చేయాలని పంపిస్తే ప్రమాదకరంగా మార్చటం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తీరు మార్చుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

క్రైం న్యూస్



పోలీసుల అదుపులో నిందితులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి డిఎస్పి వెంకట్ నారాయణ తెలిపారు. తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అలిపిరి పోలీసులు ఆటోనగర్ వద్దనున్న సుజుకి మారుతి షోరూం ముందు అనుమానాస్పదంగా ఆటోలో కూర్చున్న వ్యక్తిని తనిఖీ చేయగా ఆటోలో 22 కేజీల గంజాయి అక్రమంగా ఉంచారని గుర్తించారు. గంజాయి తరలిస్తున్న మాధవ రావు, సందీప్ అనే వ్యక్తుల అదుపులో తీసుకొని, ఆటోను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్కు తరలించామని తెలిపారు. నిందితుల అరెస్టుకు కృషిచేసిన సిఐ, ఎస్ఐ సిబ్బందిని ఆయన అభినందించారు.

బైకులు, ఆటో ఢీ
ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రేణిగుంట: రోడ్డును క్రాస్ చేస్తున్న బైక్లు ఢీకొన్నాయి. అదే సమయంలో బైక్లను వేగంగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన రేణిగుంట రోడ్లోని తిరుచానూరు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. గాయపడిన వ్యక్తులలో ఒకరికి కాలు విరిగింది. వీరిని సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు 108 సాయంతో రుయాకు తరలించారు. వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్స రానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపిపి, జెడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల అధి కారులు, పంచాయతీ కార్యద ర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సమాఖ్య మహిళా విఓ లీడర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్ర మం లో ఎంపిడివో పి శేషగిరి రావు, విస్తారణాధికారి, కె దయాసాగర్, ఎదిలీప్ కుమా ర్, యం మల్లికార్జున రావు. గ్రామ పంచాయతీ ప్రణాళి కల రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు.

రైతులకు బంగారు భవిష్యత్తు: ఏవో



సర్టిఫికెట్లు ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి -రామచంద్రపురం : భూసార పరీక్షలతోనే రైతు లకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించు కోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి అన్నారు. రైతుల పొలాలలో ఖరీఫ్ సీజన్లో భూసార పరిరక్షణ పథకం ద్వారా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు 'బంగారు నేల.. బంగారు పంట ధ్రువ పత్రాలను శుక్రవారం వ్యవసా య శాఖ అధికారి కార్యాల యంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షల వల్ల నత్రజ ని, భాస్వరం, పొటాషి యం జింక్, జింక్ ఐరన్ లభ్యత తెలుస్తుందని రైతు లకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల వల్ల రైతులు రబీ లో ఎరువులు ఎంత మోతాదు లో వేస్కో వచ్చునో ఒక అంచనాకు వచ్చి మంచి దిగుబడి పొందవచ్చునని తెలిపారు. ఈ పంపిణీ లో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సిఐని సన్మానిస్తున్న సర్పంచ్ మోహనప్రియ

శాంతి భద్రతలు కాపాడండి : సర్పంచ్

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్ : ఏర్పేడు మండలంలో శాంతి భద్రతలను ఎండీ పుత్తూరు సర్పంచ్ కందాటి మోహన ప్రియ ఏర్పేడు సిఐ జయ చంద్రను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎండి పుత్తూరు లోని సమస్యలు తెలిపి శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. అనంతరం సిఐని దుశ్శాలువతో సత్కరించారు.

విదుశేఖర భారతి తీర్థను కలిసిన టిటిడి ఈవో

ప్రజాశక్తి- తిరుపతి: శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి తీర్థ స్వామిని టిటిడి ఈవో శ్యామల రావు మర్యాద పూర్వకం గా కలిశారు. తిరుపతిలోని శృంగేరి శంకర పీఠానికి ఈవో దంపతులు శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భం గా ఈవో దంపతులను స్వామి సత్కరించి ఆశీర్వదించారు.

టిడిపి సభ్యత్వంతో భరోసా: తిరుమలరెడ్డి



ప్రజాశక్తి - రామచంద్రాపురం: టిడిపి సభ్యత్వంతో ప్రతి కుటుంబానికి భరోసా లభిస్తుందని మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి అన్నారు . ఆర్సిపురం టిడిపి కార్యాలయంలో టిడిపి సభ్యత నమోదుపై శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు , జాతీయ కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని అన్నిగ్రామాల్లో టిడిపి కొత్త సభ్యత్వం, పాత సభ్యత్వాలు రెన్యూవల్ చేసుకోవచ్చునని తెలిపారు. .18సంవత్సరాలు నిండి ఓటు హక్కు వున్న వారందరూ నమోదు కోసం ఓటర్ ఐడి, ఆధార్ నెంబర్, ఫొటో ఫోన్ నెంబరుతో పాటు సభ్యత్వం రుసుం రూ.100రూపాయ లు చెల్లించాలన్నారు. జీవిత కాల సభ్యత్వం కావాలంటే లక్ష రూపాయలు చెల్లించాలని పేర్కొ న్నారు. టిడిపిసభ్యత్వం కలిగిన ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందన్నారు. ప్రమాద బీమాను 5 లక్షలకు పెంచారని తెలిపారు. సభ్యత్వం తీసుకున్న కుటుంబ సభ్యులకు, వారి పిల్లలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ ఇస్తారని వివరించారు.

ఎమ్మెల్యేకు పాలాభిషేకం

ప్రజాశక్తి- వాకాడు: తీర ప్రాంత మత్స్యకారులకు వీలుగా వుండేందుకు పూడిక తీత పనులు చేపట్టేందుకు కృషి చేసిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్కుమార్ చిత్ర పటానికి కూటమి నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. కొండూరు పాలెం, దుగ్గరాజపట్నం, తుపిలపాలెంకు చెందిన తీర ప్రాంత మత్స్యకారులు దువ్వూరు. మధుసూదన రెడ్డి సూచనల మేరకు మండల కార్యాలయం వద్దకుచేరి రాష్ట్ర ప్రభుత్వం ముఖద్వారాల పూడికతీతను ఏర్పాటు చేసినందుకు కూటమి నాయకులు బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డిల సమక్షంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పాసిం సునీల్కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. విడుదల చేసిన రూ.97 కోట్ల నిధులతో పూడి రాయదొరువు, నవాబుపేట దగ్గర ముఖ ద్వార పూడిక తీత పనులకు సన్నాహాలు చేస్తున్నారని తెలుసుకుని మండలంలో ఎక్కువ భా గం తీర ప్రాంత ప్రజలు కొండూరు పాలెం, తూపిలి పాలెం, దుగ్గరాజ పట్నంలో ఉంటున్నారని ఇక్కడ పూడిక తీత చేపట్టడం వల్ల ఎక్కువ వుందికి ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. నాయకుల ద్వారా ఎంపీడీవో అన్నపూర్ణ రావు కు, ఎమ్మెల్యేకు విషయం తెలపాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు దోసకాయల కృష్ణమూర్తి , కుచం దయాకర్, ఆర్కెటి మహేంద్ర, రాహెమ్ తుల్లా, పి అరుణ్ కుమార్, గోపి నాయుడు, రమణయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

వైభవంగా కార్తీక పౌర్ణమి గరుడసేవ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో శుక్రవారం రాత్రి కార్తీకపౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్ప స్వామి గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీకదీపం, కేదారేశ్వర వ్రత దీపారాధన, కార్యక్రమాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం కమ్మపల్లి సమీపంలోని యోగుల పర్వతంపై ఏకవీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతాప్ స్వామీజీ కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం యోగుల పర్వతంపై ఉన్న సిద్దేశ్వర స్వామి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయల చెరువు కట్ట కింద శ్రీ జలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహిళలు దీపారాధన చేశారు. అనుపల్లి లో కార్తీక పౌర్ణమి సందర్భంగా కేదారేశ్వరవ్రతం (నోములు) నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పసుపు కుంకుమ, బొందారము, గాజులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తంజావూరు నాగూర్ శెట్టి, ప్రతాప్ స్వామీజీ, ఆకా హైమావతి, వలిగరం చిరంజీవి ఆచారి, కోనగిరి శాంతమ్మ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల పరిధిలోని తిరుమణ్యం రాజుల కండ్రిగ గ్రామం లో కార్తీక పౌర్ణమి ఉత్సవా లను వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీహరి రాజు, ఉమాపతి రాజు, పుష్పమ్మ, మంజుల, చాముండి భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష బిల్వార్చన, కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గుడిమల్లం ఆలయ ఛైర్మన్ బత్తల గిరినాయుడు పర్యవేక్షించారు.

కోట : కోట మండలం వంజివాక గ్రామంలో కామాక్షిదేవి జలసీద్దేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త పొక్కాళి బాలాజీ శెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సి ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి ప్రియవర్ధనబాబు, వై గంగాధరరావు, వార్డెన్ సి శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ వార్డెన్ సోమశేఖర్, డాక్టరు సిఎల్ చెన్నా రెడ్డి, డాక్టరు వి ప్రసన్నలక్ష్మీ, ఎన్ వరలక్ష్మి, కె యమున, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 16 నవంబరు 2024

30 నాటికి జిల్లాలో ఇసుక డీసిల్టేషన్ పాయింట్లు

- 19 నుండి ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం- క్యాంపెయిన్‌లో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈ నెల నవంబర్ 30 నాటికి జిల్లాలో 3 ఉచిత ఇసుక డీసిల్టేషన్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయని, ఈ నెల 19 నుండి ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ క్యాంపెయిన్ నిర్వహణ ద్వారా ప్రజల్లో మరుగు దొడ్ల వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా పెండింగ్ ఇసుక రీచ్‌లు, డీ సిల్టేషన్ పాయింట్ల అందుబాటుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి గనులు, భూ గర్భ శాఖ ముఖేష్ కుమార్ మీనా, కమిషనర్ ప్రవీణ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి విజయవాడ నుండి సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుండి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గనుల శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు పక్కాగా అమలు కావాలని, ప్రజలకు అందుబాటులో ఉచిత ఇసుక ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలోని మూడు డీసిల్టేషన్ పాయింట్లలో పాలచ్చురు అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్, పుల్లూరు గ్రామం, పెళ్లకూరు మండలం, స్వర్ణముఖి బ్యారేజి, గూడలి గ్రామం, కోట మండలం వెరసి 1.37 లక్షల టన్నుల ఇసుక లభ్యం వుందని తెలిపారు. ఈ నెల 30 నాటికి ఈ ఇసుక డీసిల్టేషన్ పాయింట్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ పంచాయతీ రాజ్ శశి భూషణ్ కలెక్టర్లతో మాట్లాడుతూ ఈ నెల 19 నవంబరున ప్రపంచ మరుగు దొడ్ల దినోత్సవం (వరల్డ్ టాయిలెట్ డే) పురస్కరించుకుని 'హమారా సౌచాలయ.. హమారా సమ్మాన్ క్యాంపెయిన్ ప్రారంభించి డిసెంబర్ 10 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహించాలని తెలిపారు. డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం నాటికి ఈ క్యాంపెయిన్ పూర్తి అవుతుందని, ఈ క్యాంపెయిన్ ద్వారా ప్రజల్లో మరుగుదొడ్ల సౌకర్యం వినియోగించుకోవడం పై, స్వచ్ఛత, పరిశుభ్రత పై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా గనులు , భూగర్భ శాఖ అధికారి బాలాజీ నాయక్, జిల్లా పంచాయితీ అధికారిణి సుశీల దేవి, ఎస్ఈ ఆర్ డబ్ల్యూఎస్ విజయ కుమార్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో నూతన పరిశ్రమ 'నిడెక్ ఇండియా' ఉత్పత్తులు ప్రారంభం

ప్రజాశక్తి - సత్యవేడు: ఎలక్ట్రిక్ మోటార్లు తయారు చేసే జపాన్ కు చెందిన ప్రముఖ నిడెక్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ నిడెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ శ్రీసిటీలో తన నూతన పరిశ్రమలో ఉత్పత్తిని ప్రారంభించింది. భారతదేశ ఎయిర్ కండీషనర్ (ఏసీ) తయారీ రంగంలో ఇదో ప్రధాన మైలురాయి కాగా, పరిశ్రమ ఆవరణలో లాంఛనంగా నిర్వహించిన కార్యక్రమానికి చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ టకాహషి మునియోతో, నిడెక్ చైర్మన్ హిరోషి కోబె, నిడెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కెయిజీ ఒషిమా, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీసిటీ డొమెస్టిక్ టారిఫ్ జోన్ లో ఏర్పాటైన ఈ ప్లాంట్ లో 2025 జనవరి నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తులు ప్రారంభం కానుంది. సుమారు రూ. 50 కోట్లు పెట్టుబడితో 6 మిలియన్ మోటార్‌ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ లో 200 మందికి ఉద్యోగాలు దక్కాయి. డైకిన్, వోల్టాస్, అంబర్, హావెల్స్‌తో సహా ప్రధాన ఏసీ పరిశ్రమలకు కంపెనీ ఉత్పత్తులను సరఫరా చేయనుందంటూ నిడెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కెయిజీ ఒషిమా తెలిపారు. తమ కొత్త ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంచుకున్నందుకు నిడెక్ ఇండియాను టకాహషి మునియోతో అభినందించారు. భారతదేశపు ప్రధాన వ్యాపార కేంద్రాలలో ఒకటిగా, ముఖ్యంగా జపాన్ పెట్టుబడులకు అనువైన సురక్షిత ప్రాంతంగా ఆయన శ్రీసిటీని ప్రశంసించారు.



ఏపీ ప్రభుత్వ సహకారం, దార్శనికతకు అద్భుతం

నిడెక్ చైర్మన్ హిరోషి కోబె మాట్లాడుతూ గృహ ఉపకరణాలు, ఆటోమొబైల్స్ కోసం మోటార్ల తయారీతో వ్యాపారం ప్రారంభించి, ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొని క్రమంగా వ్యాపారాన్ని విస్తరించామని తెలిపారు. శ్రీసిటీ పరిశ్రమ ద్వారా ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు తమను జపాన్ లో కలసి, రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అది ఇన్నాళ్లకు ఫలించి ప్లాంట్ ఏర్పాటుకు దారి తీసిందన్నారు. భారతదేశంలో నిడెక్ విస్తరణ భవిష్యత్ ప్రణాళికల గురించి ఈ సందర్భంగా ఆయన వివరించారు. భారతదేశంలో నిడెక్ విస్తరణ ప్రణాళిక వెనుక రాష్ట్ర పెట్టుబడి అనుకూల విధానాలు, మౌలిక సదుపాయాల వృద్ధి కీలకమైనవిగా పేర్కొంటూ, నిరంతర సహాయ సహకారాలు అందిస్తున్న ఏపీ ప్రభుత్వం, కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. దేశంలోని అగ్ర వ్యాపార గమ్యస్థానాలలో ఒకటిగా ఎదిగిన శ్రీసిటీలో అనేక ప్రముఖ సంస్థలు, ఇతర అనుబంధ పరిశ్రమల స్థాపనతో మంచి వ్యాపార అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. ప్రత్యేకించి ఎయిర్ కండీషనర్ల తయారీ కేంద్రంగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఏపీ ప్రభుత్వ నూతన స్నేహపూర్వక పారిశ్రామిక విధానం పెట్టుబడిదారులకు విశేష ప్రయోజనాలను చేకూరుస్తాయన్నారు.

ఏసీల తయారీ రంగంలో శ్రీసిటీ మరింత బలోపేతం

నిడెక్ పరిశ్రమ రాక ఇక్కడ పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసిందన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రస్తుతం ఎయిర్ కండిషనింగ్ తయారీ కేంద్రంగా మారడంతో పాటు వివిధ తయారీ రంగాలకు చెందిన 220 ప్రముఖ సంస్థలకు నిలయంగా నిలిచిందన్నారు. అగ్రశ్రేణి ఏసీ సంస్థలు మరియు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో త్వరలో దేశంలోని ఏసీల ఉత్పత్తిలో సగానికి పైగా శ్రీసిటీలో తయారవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపార పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో శ్రీసిటీ పాత్రను ప్రస్తావిస్తూ, దీని వలన లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గడం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం రూపంలో ఇక్కడ కంపెనీలు మరింత ప్రయోజనం పొందుతాయని చెప్పారు.

పోరాట గిరిజన నేతను స్మరించుకోవడం బాధ్యత: డిఆర్‌ఓ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : భారతదేశంలో బ్రిటిష్ వాళ్ల వలస వాద వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండాని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతీయ గౌరవ్ దివస్ (గిరిజన స్వాభిమాన ఉత్సవాలు 2024) సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎస్.మూర్తి ల తో కలసి ముఖ్య అతిథిగా డి ఆర్ ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటిష్ వాళ్ల వలస వాద వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా గిరిజన తెగకు చెందిన టువంటి యువకుడు తనకు ఉన్న జ్ఞానంతో బ్రిటిష్ వాళ్ళ ను ఎదిరించిన నాయుకుడు భగవాన్ బిర్సా ముండా ను స్ఫూర్తిగా తీసుకోవాలని గిరిజన నాయకులకు బాలికలకు చూచించారు. ప్రస్తుత సమయం లో పుస్తకాలకు సంబంధించిన విజ్ఞానం కొరవడుతుందని, పిల్లలు ఎక్కువ సెల్ ఫోన్ వాడకం పై శ్రద్ధపెట్టుతున్నారని, స్వాతంత్ర సమరయోధుల వారి జీవిత చరిత్రను నేటి విద్యార్థులు చదివి చైతన్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కార్యాలయ సిబ్బంది మురళి, ముత్తు,పూర్ణిమ, బాను, ప్రిన్సిపాల్ రేఖ, గిరిజన



నాయకులు దేవరాజులు,సుబ్బరాజు,రాము, యన్ జి ఓ లు,ధనశేఖర్, రంగాచారి పాల్గొన్నారు.



చిత్తూరు అర్బన్:ముండా తెగకు చెందిన వీర స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా అని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి బి.ప్రదీప్ కుమార్ అన్నారు. చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మిట్టూరు లోని శ్రీ విజయం కళాశాల సమావేశ మందిరంలో జన జాతీయ గౌరవ దివాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వపు పోటీల్లో ప్రథమ స్థానంలో ఏ.జోషిక నిలిచింది.ఈమెకు రూ.500. నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.ద్వితీయ బహుమతి గా రూ.400 నగదు, ప్రశంసా పత్రం సకినా జెహ్రా కు అందించారు.బి.గ్రీష్మా కు రూ.300, ప్రశంసా పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర ప్రాంతీయ గణాంకాధికారి ఎం.సి.బాబురెడ్డి,సిబ్బంది ఎస్.రాజకుమారి, యూత్ లీడర్ జానకిరామ్,ఎన్.వై.వి హరీష్,100 మందికి పైగా యువతీయువకులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపిడివో ఇందిరమ్మ

గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యం: ఎంపిపి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం రిసోర్స్ పర్సనల్ కిషోర్, వెన్నెల, మనోజ్ లు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభిషేకం

ప్రజాశక్తి- తిరుపతి: తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 2 గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి, 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు అభిషేకం, అలంకారం, అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపట్టారు. తర్వాత సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు అన్నలింగ దర్శనం కల్పించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన, శుద్ధి అనంతరం రాత్రి 7.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

- 2వేల లీటర్లు ధ్వంసం- అనుమానితులపై కేసు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని పొదలపల్లి గ్రామంలో కార్వేటినగరం సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలు, 30 మంది సిబ్బందితో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు రెండువేల లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం చేశారు. చేసి 30 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకున్నట్టు కార్వేటినగరం సీఐ తెలిపారు. పొదలపల్లి లో సారా విచ్చలవిడిగా దొరుకుతున్న సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం స్పెషల్ పార్టీ తో గ్రామం పై ఏకకాలంలో 35 మంది సిబ్బందితో దాడి నిర్వహించారు . పొలాల నుంచి వరిగడ్డి మధ్య సారా సేకరించి ధ్వంసం చేస్తూ ఊట డ్రమ్ములు లను సారాను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించి వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్ , కార్వేటినగరం ఎస్ఐ రాజ్ కుమార్ ,వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ సుమారు 30 మంది పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గ్రామపంచాయతీల్లో గ్రామసభలు అభివృద్ధి పనులుకి ముందుస్తు ప్రణాళికలు తయారు చేసుకోవచ్చని ఎంపీపీ అనిత, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి అన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీవో లీడర్లు, డిజిటల్ అసిస్టెంట్లుకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 ఆన్‌లైను విధానం వచ్చిన తరువాత అనేక మార్పులతో ప్రస్తుతం గ్రామాలకు సంబంధించిన నిధులు ఎంత వస్తున్నాయి, దేనికి ఖర్చు పెడుతున్నారని, ఎంత నిల్వ ఉంది ఇలా ప్రతి విషయాన్ని సామాన్య పౌరుడు దగ్గర నుంచి మన రాష్ట్ర పాలకుల వరకు ఎవరైనా ఎప్పుడైనా చూసుకునే సౌకర్యాన్ని కల్పించారన్నారు.

'టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి '

ప్రజాశక్తి - రామకుప్పం: టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర నేత మునస్వామి కోరారు. శుక్రవారం మండలంలోని బల్ల పంచాయతీలో టిడిపి సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభ్యత్వంతో పార్టీ గుర్తింపుతో పాటు ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు యువత ముందుండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత గిరిదాస్, నాగభూషణం, మనోహర్, బద్రి, ఎర్రప్ప పాల్గొన్నారు.